# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

బుధవారం 26-7-2023




## మూగబోయిన మరో గానం

ప్రముఖ సింగర్ మృతి

**న్యూఢిల్లీ, జూలై 26 (తెలుగుప్రభ)**

సంగీత అభిమానులకు మరో చేదు వార్త. ప్రముఖ పంజాబీ సింగర్ సురీందర్ షిండా (64) బుధవారం ఉదయం తుది శ్వాసవిడిచారు. కొంత కాలంగా ఆయన ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నెల 11న లూధియానాలోని డీమెస్‌సీ ఆసుపత్రిలో చేరారు. గత రెండు వారాలుగా చికిత్స పొందుతున్న ఆయన ఆ రోజు కన్నుమూశారు. షిండా మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు, సెలబ్రెటీలు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. షిండా మృతిపట్ల నివాళులు అర్పిస్తూ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ట్వీట్ చేశారు. 'గాయకుడు సురిందర్ షిండాజీ మరణ వార్త వినడం చాలా బాధాకరం. పంజాబ్‌లో అతని స్వరం మూగబోయింది. షిండాజీ భౌతికంగా లేకపోయినా ఆయన స్వరం పాటల రూపంలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తుంది. షిండాజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానంటూ' సీఎం భగవంత్ మాన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.



## 'సుప్రీం'కు వెళ్తా

**కొత్తగూడెం, జూలై 26(తెలుగుప్రభ):**

ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ప్రజలు వేసిన ఓట్లతోనే తాను అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందానన్నారు. ప్రజాబలంతో గెలిచిన తాను, అనర్హతపై సుప్రీంకోర్టులో తేల్చుకుంటానని చెప్పారు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో గెలుపు ఓటములు, ఆటుపోట్లు చూశానన్నారు.




# అఫి'డౌట్లు'

## ఎన్నికల వేళ చిత్రాలెన్నెన్నో..!

**ప్రజా ప్రతినిధులెవరు? ఏ పార్టీ వారన్నది పక్కన పెడితే ఎమ్మెల్యేలే కాదు.. కార్పొరేటర్లు సైతం తప్పుడు అఫిడవిట్లు సమర్పించి అనర్హత వేటు పడ్డవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో చాలామంది అభ్యర్థులు సమర్పిస్తున్న అఫిడవిట్లు అనుమానాలకు తావిస్తున్నాయి.**

**హైదరాబాద్, జూలై26(తెలుగుప్రభ):**

రాష్ట్ర చరిత్రలోనే ప్రప్రథమంగా ఒక ఎమ్మెల్యేను అనర్హునిగా పేర్కొంటూ హైకోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చింది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని చెప్పింది. మరో ఎమ్మెల్యేకు సైతం చుక్కెదురైంది. ఆయనపై దాఖలైన పిటిషన్ విచారణార్హమైనదని వెల్లడించింది. ఈ రెండు కేసులు కూడా ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారమిచ్చారనే ఆరోపణలతో నమోదైనవే. ఎన్నికల్లో పోటీచేసేముందు ఇచ్చే అఫిడవిట్లను గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. గెలిచాక సైతం వారి వల్ల స్వల్ప ఓట్లతో ఓడిన వారో, లేక వ్యక్తిగత, వృత్తిపర(రాజకీయ) వైరమున్నవారో మాత్రమే వెంటాడుతారు.వారి గురించి తమకు తెలిసిన నిజాలకు బదులు అఫిడవిట్లలో వేరే వివరాలుంటే కోర్టుల నాశ్రయించడం పరిపాటిగా మారింది. వీటిల్లోనూ చాలా వరకు గెలిచిన వారు అనర్హులైతే ఆ పదవి తమకు దక్కే అవకాశం ఉన్నవారు మాత్రమే వెళ్తారు. అఫిడవిట్లలో ఎక్కువగా ఫిర్యాదులు నమోదయ్యేవి ఆస్తులు, క్రిమినల్ కేసులు, అధికసంతానం వివరాలను దాచడం వంటివే.అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు సమర్పించడం చట్టవిరుద్ధమైనప్పటికీ వాటిని పెద్దగా పట్టించుకుంటున్న వారు లేరు. దర్జాగా అధికార యోగం అనుభవించే అవకాశం ఉండటంతో తాము చేస్తున్నది తప్పని కూడా భావించడం లేరు. ఎప్పుడో అప్పుడు ఎవరో ఒకరు ఇలా కోర్టులకు వెళ్తే.. తప్పుడు వివరాలు నిరూపితమైనా వారికి పెద్దగా పోయేదేమీ ఉండదు. తీర్పులు వచ్చేసరికి పదవీకాలం ముగుస్తుంది. తదుపరి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఉండదు. తాము గెలిచామన్న తృప్తి తప్ప పెద్దగా ఒరిగేదీ ఉండదు. నెలో, ఆర్నెల్లో పదవీయోగం దక్కుతుంది. అదీ సంబంధిత ఎన్నిక కాలపరిమితి ఉంటే. లేని పక్షంలో మిగలదు.

### అన్నీ నిజాలేనా ?

ఈ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పడం కష్టమే. మనకు తెలిసిన, మనం చూస్తున్న వ్యవస్థలో చాలామంది సమర్పించే అఫిడవిట్లలోని వివరాలకు, వారి ఆదాయాలు, ఆస్తులకు హస్తిమశకాంతరం వ్యత్యాసం కనిపిస్తుంది.ఇక క్రిమినల్ కేసుల వంటివి అందరికీ తెలిసే అవకాశం ఉండదు. తప్పుడు అఫిడవిట్లు సమర్పించినా, ఎవరో ఫిర్యాదు చేస్తే తప్ప పరిశీలించే వ్యవస్థ లేదు. చాలా అంశాల్లో ద్వంద్వ విధానాలు కొనసాగుతుంటాయి. ఎన్నికల వ్యయాన్నే తీసుకున్నా పరిమితిని మించి ఖర్చు చేయడం అందరికీ తెలిసిందే. బడా సంపన్నులు మాత్రమే పోటీచేసే విధంగా ఎన్నికల వ్యయం పెరిగిపోయింది. వివిధ సందర్భాల్లో నిబంధనలే వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉంటాయి.

### ఆస్తులు లేకున్నా..

దేశంలో ఎన్నికల అఫిడవిట్లలో సమర్పించిన వివరాల మేరకు పశ్చిమబెంగాల్‌లోని ఇండస్ నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్మల్‌కుమార్ అత్యంత పేద ఎమ్మెల్యేగాఉన్నారు. పోటీ చేసే సమయంలో ఆయన వద్ద ఉన్నది కేవలం రూ.1700 మాత్రమే. అంతకు మించి నగదుకానీ, ఆస్తులు కానీ లేవు. అయినప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రూ.6.40 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారికంగానే చూపించారు.నిర్మల్‌కుమార్‌కు టిక్కెట్టిచ్చిన పార్టీ చేసిన మొత్తం ఖర్చులో ఈయనకు కొంత కేటాయించారన్నమాట. ప్రజాస్వామ్య సంస్కరణల కోసం పనిచేస్తున్న ఏడీఆర్ అనే సంస్థ 'నేషనల్ ఎలక్షన్ వాచ్' పేరిట ఈ వివరాలు వెల్లడించింది.ఆ సమాచారం మేరకు2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన వారిలో దాదాపు 82 శాతం మంది కోటీశ్వరులు.43 శాతం మంది తమపై క్రిమినల్ కేసులున్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారిలో 89 శాతం మంది కోటీశ్వరులే.

### ప్రతిజ్ఞ అంటే తెలిసే చేస్తున్నారా ?

ఇక ప్రతిజ్ఞలకు సైతం కనీస విలువ లేకుండా పోతోంది. పాఠశాలల్లో ప్రతిజ్ఞలు చదివే విద్యార్థుల నుంచి మొదలు పెడిత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి చట్టసభల్లో ఉండేవారిలో సైతం ఎంతమంది ప్రతిజ్ఞలకు కట్టుబడి ఉంటున్నారో వారి అంతరాత్మలకు మాత్రమే తెలుసు.

### పెద్దగా పట్టించుకోరు

తాము ఓటువేసే అభ్యర్థుల్లో అత్యధిక సంపన్నులెవరో, అతి పేదలెవరో తెలుసుకోవాలనే ఉత్సుకత స్థానికులకు ఉంటుంది. అందువల్ల అఫిడవిట్లలోని వివరాలను మీడియా సంస్థలు వెల్లడిస్తాయి. ఆ రోజుతో ప్రజలు ఆ వివరాలు మరిచిపోతారు.

**–రాకేశ్, ఐటీ ఉద్యోగి, రామ్‌నగర్.**



## భర్తను కొట్టి.. భార్యకు ఉరివేసి..

**కామారెడ్డి, జూలై26(తెలుగుప్రభ):**

జిల్లాలోని బీర్కూర్ మండలం రైతునగర్‌లో కిరాణాషాపు యజమాని, అతని భార్యను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చంపారు. ఇంటి వెనుక నుంచి లోపలకి ప్రవేశించిన దుండగులు షాపు యజమాని నారాయణ(70)ను కొట్టి చంపారు. అతని భార్య సులోచనను హాల్లోకి తీసుకువెళ్లి చీరతో ఉరివేశారు. ఈ దంపతులకు సంతానం లేదు. వీరిద్దరే ఉంటున్నారు. బుధవారం ఉదయం నారాయణ మేనల్లుడు కృష్ణమూర్తి వారిని నిద్ర లేపేందుకు తలుపుకొట్టగా ఎంతసేపటికీ ఎవరూ రాలేదు. ఇంటి వెనుకవైపు వెళ్లి లోనికి చూడగా వేర్వేరు గదుల్లో విగతజీవులై పడి ఉన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ వైద్య రంగంలో మరో సంచలనం



ఉచితంగా ఊపిరితిత్తుల మార్పిడి

**హైదరాబాద్, జూలై 26 (తెలుగుప్రభ)**

**వైద్యపరంగా అగ్రభాగంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పేదలకు కార్పొరేట్ వైద్యం రాష్ట్రంలో అందుతోంది. ఈ క్రమంలో మరో ముందడుగు వేసింది. ఆరోగ్యశ్రీ కింద మొదటిసారి పూర్తి ఉచితంగా ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్ నిర్వహించి, నిమ్స్ వైద్యులు ఓ రోగికి ప్రాణం పోశారు.**

వరంగల్‌కు చెందిన 16 ఏండ్ల విద్యార్థి రాయపురి పూజను నిమ్స్ వైద్యులు మంగళవారం బ్రె యిన్‌డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, కార్నియాను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో నిమ్స్ వైద్యులు ఒకే రోజు ఆరోగ్యశ్రీ కింద ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటివరకు నిమ్స్‌లో 27 అవవయ మార్పిడులు చేశారు. ఇప్పుడు తాజాగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గిపోవడంతో మార్పిడి చేసి ఆమెకు జీవితం ప్రసాదించారు.

### ఒక్క మార్పిడి.. ఆరు సర్జరీలతో సమానం

సీటీ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ అమరీశ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం సుమారు 12 గంటల పాటు శ్రమించి హైమావతికి ఊపిరితిత్తుల మార్పిడి చికిత్సను విజయవంతంగా పూ ర్తి చేసింది. ఇందులో నిమ్స్‌కు చెందిన సుమా రు 8 విభాగాలు భాగస్వాములు అయ్యాయ ని, దాదాపు 40 మంది సిబ్బంది శ్రమించారని డాక్టర్ అమరీశ్ తెలిపారు. ప్రస్తుతం హైమావతి ఆరోగ్యం స్థిరంగా ఉన్నదని చెప్పారు. ఆమె పూర్తిగా కోలుకొనేందుకు మరింత సమయం పడుతుందని పేర్కొన్నారు.

### సీఎం కేసీఆర్ ప్రోత్సాహం వల్లే..

ప్రభుత్వం ప్రోత్సాహం వల్లే నిమ్స్‌లో తొలిసారిగా ఆరోగ్య శ్రీ కింద ఊపిరితిత్తుల మార్పిడి చికిత్స నిర్వహించగలిగామని నిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ బీరప్ప తెలిపారు. ఇందులో భాగస్వాములైన సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు అందిస్తున్న ప్రోత్సాహం వల్లే నిమ్స్‌లో వరుసగా అరుదైన సర్జరీలు నిర్వహించగలుగుతున్నామని, ప్రైవేట్‌లో రూ.20 లక్షల వరకు ఖర్చయ్యే సర్జరీలను సైతం ఆరోగ్య శ్రీతో ఉచితంగా పొందగలమనే భరోసా పేదలకు లభించిందని అన్నారు.




## జలం.. భయం.. 'రెడ్' అలర్ట్

**హైదరాబాద్, జూలై 26(తెలుగుప్రభ):**

రాష్ట్రంతోపాటు హైదరాబాద్‌లో నేడు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్,జనగామ,సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం,వరంగల్, హన్మకొండ,రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఇవికాక మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

అత్యవసరం అయితే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని జీహెచెంసీ సూచించింది. ఈవీడీఎం విభాగం గ్రేటర్ పరిధిలోని 70 లక్షల మందికి ఎస్ఎంఎస్‌లు పంపింది. వర్ష సమస్యలు ఎదురైతే ప్రజలు జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్ నెంబర్ 040–21111111ను కానీ,డీఆర్ఎఫ్ నెంబర్ 9000113667ను కానీ సంప్రదించవచ్చునని పేర్కొంది.

### 24 గంటలూ అందుబాటులో

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్నిరకాలుగా అప్రమత్తంగా ఉందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలు ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూం ద్వారా అధికారులను సంప్రదించగలరని కోరారు.



### ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని..ఆఫీసుకు పామును తెచ్చాడు

హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలకు అల్వాల్ ప్రాంతంలో ఓ ఇంట్లోకి పాము రావడంతో వాళ్లు ఆందోళన చెందారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి 6 గంటలు గడిచినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఓపిక నశించి సంపత్ కుమార్ అనే యువకుడు అల్వాల్ జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీసుకు పామును తీసుకొచ్చాడు. టేబుల్‌పై పెట్టిన పామును పెట్టి నిరసన తెలిపాడు. దీంతో అధికారులు అవాక్కయ్యారు.

## వడగళ్లు.. విమానానికి రంధ్రం..

**న్యూఢిల్లీ, జూలై 26 (తెలుగుప్రభ)**

వర్షం వల్ల ఏకంగా ఓ విమానం అత్యవసరంగా ల్యాండ్ అవ్వాల్సి వచ్చింది. వడగళ్ల వర్షంతో ఏకంగా విమానానికి రంధ్రం పడింది. ఇటలీలోని మిలాన్) నుంచి అమెరికా లోని న్యూయార్క్ జేఎఫ్ కే ఎయిర్ పోర్టుకు బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రోమ్ లో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. న్యూయార్క్ పోస్ట్ నివేదిక ప్రకారం.. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన 185 నంబర్ విమానం 215 మంది ప్రయాణికులతో మిలాన్ నుంచి బయల్దేరింది. అయితే విమానం గాల్లోకి ఎగిరిన సమయంలో అనుకూలంగానే ఉన్న వాతావరణం.. ఆ తర్వాత ఒక్కసారిగా ప్రతికూలంగా మారిపోయింది. విమానం గాల్లోకి ఎగిరిన 15 నిమిషాల్లోనే వడగళ్లు, పిడుగులతో కూడిన వర్షం కురవడం మొదలు పెట్టింది. ఆ వడగళ్లు విమానం ముక్కు, రెక్కలు పై పడ్డాయి. దీంతో అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. విమానం ముక్కుకు ఏకంగా పెద్దపాటి రంధ్రం పడింది. అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని రోమ్ కు మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



